

ముందు వేసవికాలంలో ఒకరోజున బాగా ప్రొద్దెక్కిన తర్వాతనే కొంచెం దూరపు వూరికి నేను కర్మవశాత్తూ ప్రయాణం చెయ్యవలసి వొచ్చిందని – ఎక్కువ ఉపోద్ఘాతం లేకుండా – చెపితే మీరు నన్ను నమ్మొచ్చును. కరకట్టమీద కాలిబాటన నేను నడుస్తున్నాను. నాకు చేతిప్రక్కన కృష్ణానదీ – నదిలో పురుగుల్లాగా పడవలూ – అక్కడక్కడ రేవుల్లో బట్టలు పైకి ఎగకట్టి, వచ్చీ పోయ్యేవాళ్ళను చూస్తూ, గుడ్డలు బాచి వుతికే చాకలి పడుచులూ – ఇవన్నీ ఆనందం కలుగచేస్తున్నా యని భావించుకోటానికి ప్రయత్నం చేశాను.

దారిపొడుగునా పెరుగుతట్టలూ, కట్టెల మోపులూ నెత్తిన పెట్టుకుని అమ్ముకోటానికి, బస్తీకి పోతూ వింత వింత పడుచులు ఎదురైనారు. ఎవరో వెనక వుండి వీళ్ళందర్నీ నాకొరకు – నా యిష్టంవచ్చిన వాళ్ళని కోరుకో మని – ఒక్కొక్కరినే లైనుగా పంపిస్తున్నట్టుగా వుంది. ఒక్కొకరే చూపుమేర దూరంలో పుట్టి, మూడు నిమిషాల్లో, పెద్దవాళ్ళయి – నాకు చాలదగ్గిరవాళ్ళయి – నా కళ్ళలోకి–భయంగా – నిర్భయంగా – చింతగా – నిశ్చింతగా – గూఢంగా – నిగూఢంగా – సంతోషంగా – శాంతంగా – సిగ్గుగా – కొంటెగా – విధవిధాలుగా చూచి, తాకేటంత దగ్గిరగా వొచ్చి, కొంచెం పక్కకు తొలిగి, మాయమై పోతున్నారు. వాళ్ళ భావ తరంగాలు ఏమిటి? వాళ్ళ హృదయాలకూ, నా హృదయానికీ, ఈ దాటరాని దూరం ఎందుకు? హృదయాన్ని చూచే శక్తి హృదయానికి వుంటే, లోకం ఇట్లా వుండదుగదా!

ఇదంతా వేదాంతం! ఎండ అనుకోక ప్రకృతి అందాలను చూచి తనివితీర ఆనందిద్దా మని వుద్దేశించిన నేను ఎట్లాగో బురదలాంటి వేదాంతంలో పడ్డాను. ఇంతలో దూరాన వినవస్తూన్న ఒక పాట నన్ను ఆ బురదలోంచి పైకి లాగింది.

ఒకపుట్ట దాటాను; ఒక మలుపు తిరిగాను; చెట్టునీడన ఎవరో, ఒక్కడూ కూచుని పాడుకుంటున్నాడు. తన పాటను తను తప్పక ఆనందిస్తూ గూడా వుండి వుండాలె. ఆత్మానుభవాన్నిపట్టి అల్లాం

పిల్లలమఱ్రి బాలకృష్ణశాస్త్రి



టప్పుడు పాట పసలేకపోయినా కలిగే ఆనందానికి కొదువ వుండ దని చెప్ప గలను.

"రాగ...సు ధా ర స...పానము... చేసి..." అని పాడుతున్నాడు.

"పానము"లో "పా"ను సాగదీసి, బిగ్గరగా,నోరంతా తెరిచి వుచ్చరిస్తూంటే, అసలు పాటకు ఎక్కువ లాహిత్ కాక పోయినప్పటికీ, అర్థానికి చాలా అను గుణంగా వుందని చెప్పక తప్పదు.

మళ్ళీ "రాగసుధారస పా–" దాకా పాడి అక్కడ నన్ను చూచి, అధాట్టుగా ఆగిపోయినాడు. నేను దగ్గిరికి వెళ్ళే టప్పటికి నన్ను చూచి ఆపినట్టుగా వుండకుండా–వినపడీ వినపడకుండా – గొణుగుపాట పాడుతున్నాడు.

మొహం చూస్తే చదువుకున్న మొహం లాగానే వుంది. కళ్ళజోడు పెట్టుకొన్నాడు. గడ్డం మీసం నాజూగ్గా పెంచాడు. లాల్చీ తొడుక్కున్నాడు. అడ్డకం వేసిన ఖద్దరు వుత్తరీయం వల్లెగా వేసుకున్నాడు.

"ఏమండోయి?––అయ్యా?"

దగ్గిరికి వెళ్ళాను.

"మీ దగ్గిర అగ్గిపెట్టె వుందా?"

జేబులోంచి వెతికి తీసి ఇచ్చాను.

అది తీసుకుని చేతిలో పట్టుకుని కొంచెం అనుమానిస్తూ, సిగరెట్టు కూడా వుందా?" అన్నాడు. లిటరేచరు ఆటలో 'డైమనురాణి వుందా? – కళావరు రాజు వుందా'–అని ఒక్కొక్కళ్ళే వరుసన లాగుతారే అట్లా వుంది ఈ అడగడం. సిగరెట్టు ఇస్తే వక్కలూ – తమలపాకు బీడీలూ – ఇంకా ఆ పైపై అడిగేటట్టుగా వున్నాడు, అతని వాలకం చూస్తే. అయినా చిన్నప్పటి నించీ మొహమాట స్తుణ్ణి కావటంచేత లేదనలేక సిగిరెట్టు కూడా యిచ్చాను.

అతను సిగరెట్టు వెలిగించాడు, నేను గూడా ఒకటి తీసి వెలిగించాను.

"ఎండ! – ఏ మెండ! – అదిరిపో తోంది" అన్నాడు.

అవును అన్నట్లు తలవూపాను,

"ఎందాకా మీరు?"

"కారుపూడి."

"సరే లెండి!–నేను కూడా అక్క డికే! – తోడుగా వెళ్ళొచ్చు. ఎండ భరించలేక కొంచెం చెట్టునీడన కూచు న్నాలేండి. ఏం, పోదామా?" అన్నాడు.

సరే ననుకొని కలిసి ప్రయాణం సాగించాము.

పది నిమిషాల్లో అతన్ని గురించి తెలుసుకోవలసిన దంతా తెలుసు కున్నాను. పేరు అడిగితే విజిటింగు కార్డు యిచ్చాడు. దాంట్లో–

'రంగా. ఎం. ఏ.

కళోపాసక్'

అని ఇంగ్లీషులో వుంది. తను కవిత్వం అల్లగల దనీ– చిత్రాలు చిత్రించగల దనీ–పత్రికలకు వ్యాసాలూ, కథలూ

పంపుతూ వుంటా డనీ — సందర్భాను సారంగా నాకు తెలియజేశాడు.

ఆ పది నిమిషాల సంభాషణలో అతను గొప్పగా చదువుకున్నా డనీ— చదువుకంటెను ముఖ్యమయింది — అతని అంతర్బుద్ధి, సంస్కారం అంటామే దాన్ని, సంపాదించుకుం దనీ — అతని మాటలవల్లనే గ్రహించగలిగాను. అల్లాంటి ప్రముఖులు దేంటోనయినా తప్పక రాణించగలరు. అయితే మనది ఆంధ్రదేశంగదా ! — "మధ్యతరగతికి చలామణీ జాస్తి అండీ ఎందువల్లనో!" అని తను చలామణీ లేని ఉత్తమ తర గతికి చెందినట్టు సూచించాడు.

ఇంతలో సంతపాలెం దగ్గరికి వొచ్చాము. నాకు గొంతు ఎండుక పోతోంది. బ్రాహ్మణ ఇల్లు వుంటే ఇన్ని మంచినీళ్ళు తాగుదాం రమ్మన్నాను. రంగా ఎం.ఏ. బ్రాహ్మణఇల్లు ఎక్కడో దూరంగా వుందిగాని తను రానన్నాడు. తనకు అసలు దాహమే కావటంలే దన్నాడు. ఎల్లాగో బలవంతం చేసి ఇల్లన్నా చూపించ మని తీసుకువెళ్లాను అతన్ని.

ఇంటిదాకా తీసుకువెళ్ళి తను బయట నుంచొని నన్ను లోపలికి వెళ్ళి తాగి రమ్మన్నాడు. అతన్నిగూడా ఎండా కాలం, గొంతు పిడచకట్టుకుపోతోంది, రమ్మని బతిమాలాను; రాలేదు. నేను లోపలికి వెళ్ళాను.

వసారాలో ఒక వెధవమనిషి వుంటే "అమ్మా కొంచెం మంచితీర్థం ఇప్పిస్తారా ?" అన్నాను.

"రాజా ! వీరికి కొంచెం మంచినీళ్లు- ఇవతల బిందెలోవి-తీసుకొచ్చి ఇవ్వు- పాపం, ఎండలో వొచ్చారు." అంది.

రాజా అన్నపిల్ల మరచెంబుతో నీళ్ళు తెచ్చి నా ముందు పెట్టింది. ఆమె 17, 18 ఏళ్ళ వయసు గల మంచి చక్కని చుక్క. ఒక చిన్న పల్లెటూరులో అంట్లు తోముకుంటూ, పిడకలు చేసుకుంటూ, నీళ్ళబిందెలు బుజాన మోసుకుంటూ జీవితం గడపటానికి వుద్దేశించబడ్డ పిల్లకాదు. ఆమె ఒక వేళ ఒప్పుకొనే చేస్తా నన్నా ఇవతలవాళ్ళు చూచి సహించలేరు. ఆమె అందం అట్లాంటిది.

"ఇంకో చెంబుతోగూడా ఇవ్వండి, మరొకరుగూడా వున్నారు వీథిలో." అన్నాను; ఆమెతో మాట్లాడే అవకాశానికి సంతోషిస్తూ.

"బ్రాహ్మలేనా?'' అన్నది వెధవ మనిషి. నీళ్ళు తాగుతూ అవు నని తలవూపాను.

రాజాఅన్న పిల్ల ఇంకో చెంబుతో గూడా మంచినీళ్ళు తీసుకుని వీధి గుమ్మంలోకి వెళ్ళింది. రంగా ఎం. ఏ. ను చూసే చూడటంతోనే చెంబు కింద జార విడిచి, కెవ్వున కేక వేసి,

"అమ్మోవ్! రంగాచార్లువెధవ వొచ్చాదేవ్!'' అని గట్టిగా అరిచింది.

"ఏడీ!_వెధవ ఏడీ!" అని వెధవా విడ పరుగెత్తింది. నేను గూడా ఏమిటా అని వీధిలోకి వెళ్ళాను.

రంగా ఎం. ఏ. తిరిగి చూడకుండా, వీధి చివరగుండా పరుగెత్తి డొంకన పడ్డాడు. దగ్గిరగా నేను దొరికాను వెధవావిడ నోటికి; విరుచుకుని నామీద పడ్డది.

''ప్రతి గాడిదకొడుకూ_ప్రతి వెధవ కొడుకూ_మా ఇంటికి చావటానికి పని ఏముందంటా! _ అంత వొళ్ళు తెలియకుండా ఛస్తున్నారా! _ ఒక పుట్టువెధవ బయట నుంచుని, ఇంకో పుట్టువెధవను_కుంకను_మంచినీళ్ళ కని పే రు పె ట్టి లోపలికి పంపిస్తాడా?_ఎవరనుకున్నారో! జాగర్త!_మనసబుతో చెప్పి ముక్కోణం తీయిస్తాను _ పుట్టువెధవల్ని! ..."

''అవ్వగారూ తొందర పడకండి _ అసలు ఏమిటో చెప్పండి."

''చా ల్చా లు లేవయ్యా! _ నోరు మూసుకోక_సిగ్గులేక తగుదునమ్మా అని మాట్లాడొచ్చావు!_ పెద్దమని షన్న పెద్ద మనిషి!_పయిగా తొందర పడుతున్నానని కూస్తావట్రా, పుట్టుకుంకా!_ఇవ్వాళ్ళ మా పెద్దవాడే వుంటేనా, మిమ్మల్లిద్దర్నీ చర్మం వొలిచి అక్కడ పెట్టక పోయి నాడూ! _ గుడ్లు పెట్టుకు చూస్తూ నుంచున్నావేం ఇంకా _ పీడ విరగడై వొదిలిపోక_ఓరి మీమొహాలు మండా! మిమ్మని బండెడు కట్టెలతో తగలెయ్యా! _ ఓరి మిమ్మని మారణహోమం చెయ్యా!..."

నేను తలవంచుకుని వీధిన పడ్డాను. డొంకలోకి పొయ్యేవరకూ కూడా విన పడుతూనే వున్నాయి, ఆ ఇల్లాలు గుక్క తిప్పుకోకుండా, వన్నెలు వన్నెలుగా తిట్టిన తిట్లు.

వూరికి అరమైలు దూరాన చెరువు గట్టున చెట్టుకింద కూచున్నాడు రంగా ఎం. ఏ. _ శాంతంగా ఏమీ జరగనట్టు.

"నా దుంప తెంచావు!" అన్నాను కోపంతో.

"నీవు నా తాడు తెంచావు!" అన్నాడు నవ్వుతూ. "అందుకనే నాకు మంచినీళ్ళు ఏపాడూ వద్దన్నాను. తాగినవాడివి నీవు చక్కారాక _ ఆ రాజాను నా మీదికి తోలావు!"

"ఏం జరిగింది?"

"ఏం జరగలేదు__నువ్వు వింటూనే వుంటివిగా!"

"ఏమీ జరక్కపోతే అంత అల్లరి అవుతుందా?_ ఆ వెధవముండ నన్నూ నిన్నూ కలిపి బండబూతులు తిట్టిందే'''

"కొంచెంగా వినపడ్డయి నాక్కూడా_ అందుకనే రానన్నాను. అయిం దేదో అయింది, ఇహ దారిని పోదాం పద," అన్నాడు.

''నన్ను ఇన్ని తిట్లు తిట్టించి చెప్పక పోతే వూరుకుంటానా?" అన్నాను.



"వాళ్ళిద్దరు పార్ట్‌నర్‌షిప్ వదులుకుంటున్నట్టున్నారు."

దారే నడుస్తూ చెప్పటం సాగించాడు.

"వాళ్ళ చుట్టాలు మా వూళ్ళో వుండటంచేత నాకు వాళ్ళ కుటుంబంతో కొంచెం ఎరుక ఉంది. అదీకాక మాబావ గారి వూరు, కొరుపూడి, వెళ్తూ వొస్తూ దారిలో సంతపాలెంలో వాళ్ళ యింట్లో అప్పుడప్పుడు మకాం వేస్తూవుండేవాణ్ణి.

"రాజా అన్నపిల్ల చిన్నప్పటినించీ నా కళ్ళముందు పెరగడంచేత ఆమెతో ఎక్కువ చనువుగా వుండేవాణ్ణి.

"పది రోజులనాడు యీదారిని పోతూ వర్షం రావడంవల్ల ఆరోజు రాత్రి వాళ్ళ ఇంట్లో తిష్టవెయ్యటం సంభవించింది.

"వసారాలో నాకు మంచం వేశారు. రాజాగూడా ఆ వసారాలోనే కొంచెం దూరంగా మంచంమీద పడుకొనివుంది. వూరు పొద్దుకాకముందే భోజనా లయినయి. అప్పుడే ఏం నిద్ర వొస్తుంది? కళ్ళు తెరుచుకొని పడుకున్నాను. ఆమె తల్లి ఇంకా ఇంట్లో ఏదో పని చేస్తూనే వుంది.

"నిజంగా నాకు ఏ దురుద్దేశ్యమూ లేదంటే నమ్ము. వూరికే యీదాలాపంగా పడుకున్న రాజావైపు చూశాను. చీకట్లో ఆమెకళ్ళు తెరుచుకొన్నదీ మూసుకొన్నదీ తెలియలేదు. కాని ఆమె ఆకారము మటుకు స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె ఎడమకాలి బొటనవేలు అట్టా అట్టా అడుతున్నది. నేనుగూడా నా ఎడమకాలి బొటనవేలు అట్టా అట్టా ఆడించాను. వెంటనే ఆమె వేలు అడటం ఆగింది. కొంచెం వుండి ఆమె కుడికాలు బొటనవేలు కొంచెంగా కదిలినట్టుగా వుంది. వెంటనే నా కుడికాలి బొటనవేలు పెద్దగా ఆడించాను. ఆ తరవాత కొంచెం సేపు ఇద్దరం ఏమీ ఆడించలేదు. 'ఇదేదో

మంచి ఆటలాగా తోచింది. మళ్ళీ మొదలుపెట్టి ఎడమకాలి బొటనవేలు ఆడించాను — ఆమె ఎడమకాలి బొటనవేలు కదలలేదు — ఏ బొటనవేలూ కదలలేదు. కొంచెం వూరుకొని కుడికాలి బొటనవేలు ఆడించాను. తర్వాత రెండు బొటనవేళ్ళూ ఆడించాను — అది కష్టంగా వుండి, రెండు పాదాలు గబగబా ఆడించాను. ఆమె తన చిన్న చిటికనవేలు గూడా కదపలేదు. నాకు విసుగు వెయ్యటము మొదలు పెట్టింది. ఆమె నన్ను నమ్మించి మోసపుచ్చినట్టుగా వుంది. కోపంగూడా వొచ్చింది.

"ఇంతలోనే ఆమె తన కుడి చెయ్యి ఎత్తి కుడివైపున పెట్టుకుంది, ఇప్పుడు దారిలోకి వొస్తున్న దనుకున్నా. నేను గూడా ఆలస్యం లేకుండా కుడిచెయ్యి తీసి కుడివైపే కొంచెం చప్పుడు చేస్తూ వేశాను.

"నాకు బాగా ధైర్యం వొచ్చింది. ఆడవాళ్ళు ఇచ్చే ప్రేమ సూచనలు నేను బాగా అర్థం చేసుకోగలను. అంతకంటె సూచన ఏం కావాలి? అయినా ఎందు కయినా మంచిదని కొన్ని ప్రత్యేక ప్రేమ సూచనలు నేనుగూడా చేశాను.

"అంతటితో ఆగినట్టయితే ఎంతో బాగుండేది. కాని విధి!— విధి నన్ను అక్కడ ఆగనివ్వలేదు.

"నేను బయటకు పోవలసి వచ్చింది. బయటకు పోవటానికి ఆమె మంచం పక్కగా పోవలసివుంది. పొయ్యేప్పుడే ఆమెను అట్లా ఒకసారి తాకి పోదా మని కోర్కె పుట్టింది. కాని దానిని జయించ గలిగాను ఆ సారికి. మళ్ళీ వొచ్చేప్పుడు పుట్టిన ఆ కోర్కెను జయించలేక పోయి నాను. ఒక్కసారి అట్లా తాకాను. మెత్తని శరీరం వేళ్ళకు తగలగానే వొళ్ళంతా పులకరించింది. ఆమె కదల్లేదు. ఊరుకోక ఇంకోసారిగూడా... అట్లాగే చేశాను.

"ఆమె కళ్ళు తెరిచింది. నాకు కాళ్ళు వణికినయి. దబదబా వెళ్ళి ముసుకు పెట్టుకు పడుకున్నాను.

"ఆమె లేచి ఇంట్లోకి పోయి తలుపులు వేసుకుంది. అస్ఫుటంగా లోపల మాటలు వినపడ్డయి. కాని ఆమె తల్లితో చెప్పిందో లేదో తెలియదు. బయటకు మళ్ళీ ఎవరూ రాలేదు.

నా కా రాత్రి అంతా నిద్ర పట్టలేదు. తెల్లవారుఝామునే లేచి ఎవరికీ చెప్ప కుండా వెళ్ళిపోయినాను.

"మళ్ళీ ఇవ్వాళ్ళ నీ తెలివితక్కువ వల్ల వాళ్ళ ఎదుట పడ్డాను — తినాలిసిన తిట్లన్నీ తిన్నాం" అని తేల్చాడు.

"ఏదో కొద్దో గొప్పో చదువుకున్న వాడివిగదా, నీకూ్కడా ఏమి టీ పిచ్చి?— బొటనవే ళ్ళేమిటి?— ఆడట మేమిటి? — ఏమి టీఖర్మ?" అని అన్నాను, వొళ్ళు మండి.

"నేను కథకుణ్ణి. నాకు వ్రాయటానికి ఇల్లాంటి స్వానుభవం చాలా ముఖ్యం — అందుకోసం పడ్డాను ఇన్ని తంటాలూ— అంతకంటే దురుద్దేశ్యం నా కేమీలేదు."